క్లుప్తంగా

పార్కుల సంరక్షణ అందరి బాధ్యత


సూచనలు చేస్తున్న ఉద్యాన అధికారి రాధిక

ఖమ్మంమయూరిసెంటర్: పార్కుల సంరక్షణపై కార్మికులందరూ బాధ్యతగా వ్యవహరించాలని ఉద్యాన అధికారి బెల్లం రాధిక అన్నారు. మంగళవారం నగరంలోని పలు పార్కులను పరిశీలించి అందులోని మొక్కల నిర్వహణ, వాకింగ్ ట్రాక్‌లు, చిన్నపిల్లల ఆట వస్తువులను పరిశీలించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. పార్కుల్లో చెత్తలేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, మొక్కల పచ్చదనంతో ప్రజలు ఆహ్లాదకరంగా ఉండేలా చూడాలని కార్మికులకు సూచించారు. మొక్కలకు నిరంతరం నీళ్లు పట్టాలని, ప్రజలు సేదదీరేందుకు ఏర్పాటు చేసిన బల్లలు శుభ్రంగా ఉంచాలన్నారు.

పంటల నమోదు సక్రమంగా చేపట్టాలి


పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ సతీష్

తిరుమలాయపాలెం: మండలంలో సాగులో ఉన్న పంటల నమోదును సక్రమంగా చేపట్టాలని కూసుమంచి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎం.సతీష్ అన్నారు. మంగళవారం మండలంలోని కాకరవాయి గ్రామంలో పంటల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు పత్తిని సీసీఐ ద్వారా అమ్ముకొనుటకు క్లస్టర్ పరిధిలో ఉన్న ఏఈఓలు పూర్తి చేయాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి సీతారాంరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి సాధన తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 53, 54, 55, 56వ డివిజన్లలో జరుగుతున్న డ్రెయినేజీ పనులను మంగళవారం 41వ డివిజన్ కార్పొరేటర్ కర్నాటి కృష్ణతో పాటు పలువురు నాయకులు పరిశీలించారు. రూ.2 కోట్ల నిధులతో మురుగునీరు పోయేందుకు 54వ డివిజన్ నుంచి 41వ డివిజన్‌లోని ఇల్లెందు క్రాస్‌రోడ్డు, టీటీడీసీ భవనం ఆవరణ నుంచి మినీ లకారం వద్ద మేజర్ కాల్వకు కలిపేందుకు అండర్‌గ్రౌండ్ మెయిన్ డ్రెయిన్ పనులు జరుగుతున్నాయన్నారు. నాయకులు మిక్కిలినేని మంజుల, నరేందర్, న్యాయవాది బాబ్జీ, పుల్లారావు, జవాన్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

తిరుమలాయపాలెం: అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) పాలేరు డివిజన్ ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మిడి హన్మంతరావు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని పిండిప్రోలులో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 8న ఖమ్మం రూరల్ మండలం వెంకటాయపాలెం జరిగే మహాసభకు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శివలింగం, రాష్ట్ర సహాయ కార్యదర్శి బందెల వెంకయ్య, పాలేరు డివిజన్ కార్యదర్శి యాదగిరి, సోమనపల్లి వెంకటేశ్వర్లు, వీర్ల వెంకటఅప్పారావు, చిర్రా భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	30	బచ్చలికూర	4
వంకాయ	46		20
బెండకాయ	36	పాలకూర	3
పచ్చిమిర్చి	50		20
కాకర	26	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	50	తోటకూర	4
దొండ	40		20
పొట్లకాయ	36	గోంగూర	4
చిక్కుడు	66		20
గోరుచిక్కుడు	40	మెంతికూర	3
క్యాబేజీ	30		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	30		40
చామగడ్డ	30	పుదీన	1
క్యారెట్	66		20
క్యాప్సికం	76	-ఖమ్మం వ్యవసాయం	

మురుగుకు నిలయాలుగా..

కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న శ్రీరాంనగర్ కాలనీలో వర్షం పడితే నిత్యం నీళ్లు అగిపోవడం సహజంగా మారింది. ప్రధానంగా ఇక్కడి రోడ్లు ఎత్తుపల్లాలుగా ఉండడంతో మూడు ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లోకి నీరు వెళ్లి కుంటలను తలపిస్తున్నాయి. ఫిర్యాదులు చేసినా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో వర్షం పడిన ప్రతీసారి ఇలాగే జరుగుతుందని ప్రాంతవాసులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా రహదారి, పరిసరాలను సక్రమంగా చేయాలని ఆప్రాంతా వాసులు డిమాండ్ చేస్తున్నారు.

– ఖమ్మం రాపర్తినగర్


రోడ్డు, ఖాళీస్థలంలో నిలిచిన మురుగు

కంపుకొడుతున్న డ్రెయినేజీ..

నగరంలోని మోడల్ కూరగాయల మార్కెట్ ఎదురుగా ఉన్న డ్రెయినేజీ నిండి కంపుకొడుతోంది. గత పదిహేను రోజులుగా ఇలాగే ఉంటున్నా పారిశుధ్య కార్మికులు, సంబంధిత అధికారులు, పట్టించుకోకపోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. నిత్యం వేలాది మంది తిరిగే ప్రధాన రహదారులే ఇలా అధ్వానంగా ఉంటే గల్లీల పరిస్థితి ఏంటని అక్కడి ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా డ్రెయినేజీలను శుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.

– ఖమ్మం రాపర్తినగర్


మురుగుతో పూర్తిగా నిండిపోయిన డ్రెయినేజీ

ఇళ్ల మధ్యే మురుగంతా..


ఇళ్ల మధ్య రహదారిపై నిలిచిన మురుగు


ప్రణాళికతో లేని డ్రెయిన్ల నిర్మాణం

కంపుకొడుతున్న శ్రీనివాస్‌నగర్ వీధులు

- చినుకుపడితే అంతా ఛిద్రమే
- సక్రమంగా లేని రోడ్లు, డ్రెయినేజీలు
- ఇబ్బంది పడుతున్న స్థానికులు

ఖమ్మంగాంధీచౌక్: రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు ప్రణాళికతో లేకపోవడం ప్రజలకు శాపంగా మారుతోంది. చిన్న వర్షం కురిసినా ఎగువ నుంచి మురుగు నీరు దిగువన ఉన్న ఇళ్ల మధ్య, రహదార్లపై నిల్వ ఉంటుంది. అయినా ఆ మురుగు మధ్య సహజీవనం చేస్తూ నగరంలోని త్రీటౌన్ శ్రీనివాస్‌నగర్ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఎగువ నుంచి వరద..

నగరంలోని చర్చి కాంపౌండ్, ఖిలా, వెంకటగిరి వంతెన, గాంధీపార్క్, రైల్వే ట్రాక్ కింద నుంచి అయ్యప్ప టెంపుల్ తదితర ప్రాంతాల్లో కురిసే వర్షపు నీరంతా శ్రీనివాస్‌నగర్ మీదుగా గప్‌చిప్ బండ్ల నివాసాల వారి మధ్య గుండా ప్రవహిస్తూ 17, 27 డివిజన్ల మధ్య నుంచి బెస్ట్‌లుక్ బ్యూటీ కేర్ (సెంటర్) వద్ద రోడ్లపై చేరుతుంది. చిన్న వర్షానికి కూడా డ్రెయిన్లలో ఉన్న మురుగు అంతా వచ్చి ఇక్కడ ఇళ్ల మధ్య నిల్వ ఉంటున్నాయి.

దుర్వాసనతో అవస్థలు

మురుగు నీరు రహదార్లపై నిల్వ ఉండడంతో దుర్గంధం వెదజల్లుతుంది. ఈ మార్గంలో వాహనాలు వెళ్తుండడంతో ఆ మురుగు నీరు ఇళ్లలోకి వచ్చి పడుతుంది. ఈ మార్గం రెండు డివిజన్లకు ప్రధానమైనది కావడంతో వాహనాల రాకపోకలు, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి ఇబ్బందిపడుతున్నారు. ఇక్కడ మూలమలుపు కూడా ఉండడంతో పలు సందర్భాల్లో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇక ఈగలు, దోమల కారణంగా అనారోగ్యాల పాలవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రణాళికతో నిర్మించక..

మురుగు వరదకు అనుగుణంగా రహదార్లు, డ్రెయినేజీ వ్యవస్థల ప్రణాళికలు సక్రమంగా లేకనే సమస్య ఉత్పన్నమైంది. దీనికి తోడు డ్రెయిన్లు ఎత్తుగా ఉండి రహదారులు పల్లంగా ఉండడంతో డ్రెయిన్లు పొంగి మురుగు నీరంతా రోడ్లపైకి చేరి సమస్య అధికమవుతుంది. అండర్ గ్రౌండ్ డ్రెయిన్లు లేదా వరదకు తగిన విధంగా ఉండేలా మార్పులు చేపడితే సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

కంపు కొడుతోంది..



చిన్న వర్షం పడినా ఎగువ నుంచి మురుగు వరదగా ఇళ్ల ముందు చేరుతుంది. దీంతో మురుగు కంపు మధ్య జీవనం సాగించాల్సిన వస్తోంది. ఈ రోడ్డుపై వాహనాలు వెళ్లిన సమయాన ఆ నీరు ఇళ్లల్లోకి చేరుతుంది. ఇకనైనా డ్రయిన్లు, రహదార్లు నిర్మించాలి.

– షేక్ నసీమా బేగం, శ్రీనివాస్‌నగర్

సమస్యను పరిష్కరించాలి



మురుగు నీటి మధ్య ఉండడం ఇబ్బందికరంగా ఉంది. అనారోగ్యాలకు గురవుతున్నాం. మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్నా.. ఆ శాఖాధికారులు మా సమస్యను పరిష్కరించడం లేదు. ఇకనైనా మా బాధలను గుర్తించి సమస్యలను పరిష్కారానికి చర్యలు చేపట్టాలి.

– రాటకొండ ప్రకాష్‌రావు, శ్రీనివాస్‌నగర్

ఫొటోగ్రఫీతో జ్ఞాపకాలు సజీవం..


ప్రమాణస్వీకార సభలో మాట్లాడుతున్న మేయర్

ఖమ్మంఅర్బన్: ఫొటోగ్రఫీ కేవలం క్షణాలను మాత్రమే కాక, గుర్తులను నిలిపి ఉంచి జ్ఞాపకాలను సజీవంగా ఉంచే గొప్పకళ అని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. మంగళవారం ఖమ్మంలోని ఒక హాల్‌లో జరిగిన ఖమ్మం నగర ఫొటో–వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణస్వీకారంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడిగా మేఘన శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శిగా వడ్డెటి సుధాకర్, కోశాధికారిగా బట్టు ఉపేందర్‌లచే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందడపు శ్రీనివాసరావు, తెలంగాణ రాష్ట్ర ఫొటోగ్రఫీ అసోసియేషన్ అధ్యక్షుడు హుస్సేన్, కోశాధికారి మాధవరెడ్డి, గౌరవ సలహాదారు వేముల నర్సరావు, రాష్ట్ర కార్యదర్శి చావా సంపత్, రాష్ట్ర కుటుంబ భరోసా ఇన్‌చార్జ్ నాగరాజు, జిల్లా అధ్యక్షుడు మారగాని వెంకట్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నం కనకారావు, నగర అధ్యక్షుడు బండారు శేషగిరిరావు, ఎస్‌కె. ఉస్మాన్, నారాయణరావు, వెంకట్రావు, సంజీవరావు, అమర్, తదితరులు పాల్గొన్నారు.

కులరహిత సమాజానికి పోరాడుదాం


మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

తిరుమలాయపాలెం: కుల రహిత సమాజం కోసం పోరాడాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్ అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే సత్యశోధక సమాజ్ స్థాపించి 153 ఏళ్లు పూర్తయిన సందర్భంగా న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం బచ్చోడు గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల అణచివేతతో పాటు దోపిడీ, పీడన, వివక్షను నేటి పాలకులు కొనసాగిస్తుందని ఆరోపించారు.సావిత్రీబాయి పూలే, సమాజంలో మొదటి పంతులమ్మగా అక్షరాలు తీర్చిదిద్ది బడుగు బలహీన వర్గాలకు విద్యను అందించడం కోసం చాలా కృషి చేశారని, వారి ఆదర్శాల స్ఫూర్తితో కుల నిర్మూలనకు కృషి చేయాలని అన్నారు. పార్టీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్, గొర్రెపాటి వీరస్వామి, మాగి లక్ష్మణ్, వెంకన్న, రవి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపునకు కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రామ్మూర్తి నాయక్

నేలకొండపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగిరేలా కృషి చేయాలని ఎన్నికల మండల పరిశీలకులు రామ్మూర్తినాయక్ పిలుపునిచ్చారు. మండలంలోని కోరట్లగూడెం ఎంపీటీసీ పరిధిలోని ఆచార్లగూడెం, ఆరెగూడెం, కోనాయిగూడెం, కోరట్లగూడెం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి శ్రీనివాసరెడ్డి చేసిన అభివృద్ధి పనులే అభ్యర్థులను గెలిపిస్తాయని, వ్యక్తిగత విభేదాలు వీడి పార్టీ అభ్యర్థుల గెలిపించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, తమ్మినేని నవీన్, వెంకటరెడ్డి, భద్రయ్య, బొందయ్య, యం.వెంకన్న, హనుమంతరావు, శ్రీనివాసరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

కోడ్ కూసింది.. ముసుగుపడింది..

ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయగా.. గ్రామాల్లో మంగళవారం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో గ్రామ పంచాయతీ సిబ్బంది రాజకీయ పార్టీల దిమ్మెలు, నాయకుల విగ్రహాలు, స్తూపాలకు ముసుగులు వేశారు. కాగా, నవంబర్ 11 వరకు కోడ్ అమల్లో ఉండనుంది. కూసుమంచి


గట్టుసింగారంలో ముసుగు వేస్తున్న సిబ్బంది

ఇసుక రీచ్‌లపై 'రెవెన్యూ' దాడి

- మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్


తనిఖీలో పాల్గొన్న తహసీల్దార్, సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

నేలకొండపల్లి: అక్రమ ఇసుకాసురుల దందాపై 'సాక్షి'లో తెప్పపై తెచ్చి.. ట్రాక్టర్లలో నింపి అనే కథనం మంగళవారం ప్రచురించిన విషయం విదితమే. ఈమేరకు స్పందించిన రెవెన్యూ అధికారులు మండలంలోని రామచంద్రాపురం ఏటిలో తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. దీంతో అప్పటికే తెప్పలపై ఇసుకను తీసుకొచ్చి లోడు చేస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని తెప్పలను ధ్వంసం చేశారు. ట్రాక్టర్లను స్థానిక పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ దాడులో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఆలస్యం మధు, అల్లం రవికుమార్, జీపీఓలు రామదాసు, బాలరాజు, జానీ తదితరులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న వీరునాయక్

రఘునాథపాలెం: మండలంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నివాసంలో అభ్యర్థుల ఎంపికపై జరిగిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా పోటీకి ఉత్సాహం ఉన్న పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు అజ్మీర వీరునాయక్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్దినేని వెంకటరమణ, వైస్ చైర్మన్ కొంటెముక్కల వెంకటేశ్వర్లు, పిన్ని కోటేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ గుత్తా రవి, చెరుకూరు భిక్షమయ్య, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ భూక్యా లక్ష్మణ్‌నాయక్, యాస రామారావు, వల్లభనేని వెంకటప్పారావు, నరేష్, పువ్వాడ అజయ్‌కుమార్ వ్యక్తిగత కార్యదర్శి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అలంకరణలు, పూజలు, అన్నదానాలు

శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయాలు, మండపాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారు దుర్గాదేవి రూపంలో భక్తులకు దర్శనమివ్వగా భక్తులు దర్శించుకున్నారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్


ఖమ్మంగాంధీచౌక్: కవిరాజ్‌నగర్‌లో భక్తుల పూజలు


ఖమ్మంరూరల్: రెడ్డిపల్లి మారెమ్మగుడిలో దుర్గాదేవి రూపంలో అమ్మవారు


కామేపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు


ఖమ్మంఅర్బన్: 6వ డివిజన్‌లో సరస్వతీ పూజ చేస్తున్న విద్యార్థులు


కామేపల్లి: పండితాపురంలో అన్నదానం చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు


నేలకొండపల్లి: అమ్మగూడెంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ఖమ్మంగాంధీచౌక్: 51వ డివిజన్‌లో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శీలం రమావీరభద్రం


ఖమ్మంమయూరిసెంటర్: నరసింహస్వామి గుడి వద్ద అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఏసీపీ రమణమూర్తి


కూసుమంచిలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

కళాకారులకు సన్మానం..

ఖమ్మంఅర్బన్: నగరంలోని 12వ డివిజన్ రాధాకృష్ణనగర్‌లో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నవరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా రాత్రి నిర్వహించిన భరతనాట్యం, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించగా.. ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన కళాకారులను సన్మానించారు.


కళాకారులను సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ బాధ్యులు

దళితవాడల్లో సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

ఖమ్మంరూరల్: దళితవాడల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు పి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దళితవాడల్లో విద్యుత్, సైడ్ డ్రెయిన్లు, సీసీ రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాలకులు ఎన్నికల సమయాన దళితులను కేవలం ఓటు బ్యాంక్‌గా ఉపయోగించుకుని అనంతరం వారి సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం, దళితులు మరణిస్తే అంత్యక్రియలు చేయడానికి ప్రతీ ఊరిలో రెండెకరాల భూమి కేటాయించడానికి కేవీపీఎస్ ఉద్యమించిందని తెలిపారు. అక్టోబర్ 2 నుంచి 8 వరకు పాలేరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కేవీపీఎస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ నాయకులు పగిడిపల్లి వెంకట్రావు, పుల్లయ్య పాల్గొన్నారు.

నేలవాలిన ఆశలు..



రమణాతండాలో పడిపోయిన పత్తి పంట(ఇన్‌సెట్) కుళ్లిపోతున్న పత్తి కాయలు

- గాలివానలతో పత్తి పంటకు తీవ్ర నష్టం
- ఆందోళనలో అన్నదాతలు

తిరుమలాయపాలెం: ఆరుగాలం కష్టించి పంటలు సాగుచేస్తున్న రైతన్నకు కష్టాలు తప్పడం లేదు. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పత్తి పంట నేడు చేతికొచ్చే తరుణంలో భారీవర్షాలు, గాలిదుమారాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈనేపథ్యాన మండలంలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, గాలిదుమారానికి పత్తి పంటలు పూర్తిగా నేలవాలిపోగా, పక్వానికి వచ్చిన పత్తి కాయలు కుళ్లిపోతున్నాయి. పడిపోయిన, పత్తి మొక్కలను నిలబెట్టే పరిస్థితి లేకపోవడంతో పంటలు వడలిపోయి, కుళ్లిపోతున్నాయి. గతంలో వర్షాభావంతో పంట దిగుబడులపై ప్రభావం చూపగా ప్రస్తుతం అరకొరగా వచ్చిన పంటను కూడా తీసుకోలేని పరిస్థితులతో ఉన్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి సాగుచేసి నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.